# వీధి దీపాలు

సుప్రభాతం... 15 ఫిబ్రవరి, 2003



చేతులు చాచి చుట్టుకువస్తూన్న చీకటి రాక్షసుణ్ణి భయపెట్టి ఆమడదూరం పారద్రోలుతున్నాయి వీధి లైట్లు.

వెలుగు రేఖలతో పల్లె సేదదీరుతున్నా- నిరాశా నైరాశ్యాలతో పూరిగుడిసెలో కదలాడుతున్న భుజంగం మెదడు మొద్దుబారిపోతోంది. శరీరం వశం తప్పుతోంది.

వచ్చేవారు వస్తున్నారు.., పోయేవారు వెళ్లిపోతున్నారు. ఓదార్పులూ, పరామర్శలతో కాటికి కాళ్లు చాచిన అతని మనసు షాషాణమైపోతోంది. అతనికి ఇంత విషాదంలోను గట్టిగా నవ్వాలని వుంది.., పిచ్చిగా అరవాలనుంది.

జాలారికి మటుకు అందరూ వచ్చి తమపై చూపించే సానుభూతి మరింత దుఃఖాన్ని కొనితెచ్చిపెడుతోంది.

"ఒరేయ్ఁ భుజంగం... మీ సిద్ధిగాడు చాలా అదృష్టవంతుడురా! దేశం కోసం, దేశరక్షణ కోసం ప్రాణాలర్పించాడు. వాడు ఈరోజు మన మధ్య భౌతికంగా లేకపోయినా చరిత్రలో ఎన్నటికీ చిరంజీవిగా మిగులుతాడు. వాడి త్యాగం మన గుండెల్లో ఎప్పుడూ పదిలంగా ఉంటుంది!"

– ఊరిపెద్ద నాలుగుమాటలు చెబుతుంటే భుజంగానికి దుఃఖం రావడంలేదు.

"మన సిద్ధిగాడు ఉన్నాడు చూశావా! ఎప్పుడూ ఏదో వార్తలలో ఉంటూనే వుంటాడు. స్వేచ్ఛను మనకు పంచి మృత్యువును తానొక్కడే భరించాడు. ఒక్కమాటలో చెప్పాలంటే– చచ్చికూడా బ్రతికివున్నాడు. వాణ్ణి కన్నందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను"

– ఆ ఓదార్పు మాటలు వింటుంటే భుజంగానికి అంతటి దుఃఖంలోను నవ్వు వస్తోంది. ఎదురుగా నిలువెత్తు దండలో కన్నకొడుకు ఫోటోవంక కన్నార్పకుండా చూస్తున్న అతనిలో ఏదో భావావేశం!

"సిద్ధిగా... నిజంగా నువ్వు జాతకుడివిరా! హంసలా ఆరునెలలు బతికి, ఈ సమాజంలోని కుళ్ళుకి దూరంగా కనిపించని లోకాలకి వెళ్లిపోయావు!" ఒక్కసారి భుజంగం హృదయం పగిలి భోరుమంది.

జాలారి ఓదార్చడానికి యత్నిస్తున్నా– ఆమెవల్ల కావడంలేదు. భుజంగం ఘనీభవించి బాధల బరువుతో ఒక్కసారి నిర్లిప్తమైపోయాడు. ఆరోజు జరిగిన సిద్ధయ్య సంతాప సభలోని పెద్దల మాటలు ఒక్కొక్కటిగా గుర్తుకురాసాగాయి.

జిల్లా కలెక్టరు మాట్లాడుతూ– "కార్గిల్ యుద్ధంలో శత్రుదేశపు యుద్ధవిమానం మన దేశంలోని ప్రాంతాన్ని ధ్వంసం చేయబోతుంటే మన సిద్ధయ్య అనితర సాధ్యమైన ధైర్యసాహసాలతో దేశభక్తితో ఆ యుద్ధవిమానాన్ని నేలకూల్చాడు. అతను అలా చేసివుండకపోయి ఉండివుంటే ఆ ప్రాంతమంతా పూర్తిగా ధ్వంసమై భారీ జననష్టం, ఆస్తుల నష్టం జరిగివుండేది. ఉక్కుధైర్యసాహసాలతో పోరాడిన ఈ సిపాయి శత్రుమూకల చేతిలో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం! సిద్ధయ్య నిజంగా అమరజీవి. భరతమాత ముద్దుబిడ్డలలో ఇతను ఓ మణిదీపం! ప్రభుత్వం తరపున రావాల్సిన నష్టపరిహారం, ఎక్స్‌గ్రేషియాలు త్వరలో భుజంగానికి అందజేయడం జరుగుతుంది. సిద్ధయ్యలాంటి త్యాగధనుణ్ణి కన్న భుజంగం, జాలారి దంపతుల జన్మ ధన్యమైనట్లు భావిస్తున్నాను. ఇతనికి ప్రభుత్వం పక్కా ఇల్లు కట్టించి ఇచ్చేలా కృషిచేస్తానని సభాముఖంగా మీకు తెలియజేస్తున్నాను" అనడంతో ఆ ప్రాంతం చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

మహదేవ పట్నం గ్రామసర్పంచ్ రుద్రమూర్తి సిద్ధయ్య గుణగణాలను స్తుతిస్తూ, పొగడ్తలతో ముంచెత్తుతున్నాడు. సిద్ధయ్య మంచివాడనీ, చిన్నప్పటినుండి తనకు తెలుసుననీ, ఏ పనినైనా చాలా కష్టపడి నమ్మకంగా చేసేవాడనీ చాలా చక్కగా నమ్మబలుకుతుంటే... ఆ తీయని పలుకులు అంతా వింతగా విన్నారు.

స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ– "నేను ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గ నివాసి అయిన ఓ సిపాయి దేశమాత రక్షణ కొరకు యుద్ధంలో చివరివరకు పోరాడి అసువులు బాపడం బాధాకరం! అయినా దేశ మనుగడ కోసం తుదిశ్వాస వరకు పోరుసల్పిన సిద్ధయ్యను

మనం ఆదర్శంగా తీసుకోవాలి. అతని త్యాగానికి చిహ్నంగా ఈ మహదేవ పట్నం గ్రామ నడిబొడ్డున సిద్ధయ్య శిలావిగ్రహం నెలకొల్పితే సమంజసంగా ఉంటుందని నా అభిప్రాయం. ఈ మంచిపనికి నా వంతు విరాళంగా పదివేల రూపాయలు ప్రకటిస్తున్నాను" అనడంతో- సర్పంచ్ రుద్రమూర్తితో సహా అందరూ ఎవరికి తోచినది వారు విరాళంగా ప్రకటించారు.

"ఇంత చిన్నవయస్సులోనే అమరడైన సిద్ధయ్య మృతికి చిహ్నంగా అతని ఆత్మశాంతి కోసం రెండునిమిషాల మౌనం పాటిద్దాం!" అనేసరికి అందరూ ఆయన్ని అనుసరించారు.

భుజంగానికి అంతా వింతగా ఉంది. కొడుకు చచ్చినా- తన ఇంట పండుగ చేస్తున్నా దనిపిస్తోంది. భవిష్యత్తుని శూన్యంగా చూస్తున్న కళ్ళని గట్టిగా నులిమాడు. గరగరమని రాయి కదిలి ముల్లుతో కనుగుడ్లని ఎవరో పొడిచినట్లనిపించింది. ఎదురుగా సిద్ధయ్య, వాడి ప్రక్కన బుద్ధుడి ఫోటోలు నిన్నటి జ్ఞాపకాలుగా మిగిలిపోవడంతో ఒక్కసారి గుండె పగిలిపోయింది. దుఃఖం వరదగోదారిలా తన్నుకొచ్చింది. కాల్వలై ప్రవహిస్తున్న ఆ కన్నీటిధారలలో గతం లీలగా కదలాడుతోంది.

భుజంగం రుద్రమూర్తి దగ్గర పనిచేసే పాలేరు! నమ్మినబంటుగా ఎప్పుడూ యజమాని రుద్రమూర్తి ఎదుగుదలను మనఃస్ఫూర్తిగా ఆకాంక్షించేవాడు. తన ఎదుగుదల, స్వలాభం గురించి ఎప్పుడూ ఆలోచించేవాడు కాదు.

అఖండ భారతం స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నా... తనకు గాని, తనలాంటి అభాగ్యులకు గాని ఇంకా స్వాతంత్ర్యం రాలేదని భావించి నిరాశతో నైరాశ్యంలోకి జారిపోయేవాడు. భార్య జాలారి, ఇద్దరు కొడుకులు బుద్ధుడు, సిద్ధయ్య! అందరూ కూలిపని చేసుకొని బ్రతికేవారు. తనదైన వ్యక్తిత్వం లేని భుజంగం యొక్క చేతగానితనం వాళ్ళని ఎప్పుడూ అర్థాకలిగానే ఉంచేది.

గ్రామ రాజకీయాలకు పట్టుకొమ్మ అయిన మహదేవ పట్నంలో వివాదాలకు, రాజకీయాలకు, కక్షాకార్పణ్యాలకు కేంద్రబిందువు... రుద్రమూర్తి! ఆయనగారి ఆధిపత్యం ఆ గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది.

ఆ ఊరికి నాలుగుసార్లు ప్రెసిడెంట్‌గా ఎన్నికయిన రుద్రమూర్తి- ఆ గ్రామానికి చేసింది పెద్దగా ఏమీలేదు కానీ- తమవారికి పదవులు ఇప్పించుకోవడం, తన ఆస్థుల్ని పెంచుకోవడం, అట్టడుగు బలహీనవర్గాల వారిని, సామాజికంగా వెనుకబడిన వారిని బెదిరించి వారివారి ఆస్తుల్ని ఆక్రమించుకొనేవాడు.

రుద్రమూర్తి నిరంకుశ పోకడలతో నరకం మరెక్కడో లేదనిపించేది. అతని మాట జవదాటడమంటే ఆ గ్రామంలో మనుగడ కోల్పోవడమే!

"ఏరా భుజంగం... గతసంవత్సరం ఎకరానికి దిగుబడి ముప్పైరెండు బస్తాలు వస్తే- ఈసారి ఎకరానికి ముప్పై బస్తాలకి పడిపోయింది!?"

"ఏం చేయను బాబయ్యా! ఈసారి నాట్లు వేయడం లేటయింది. అదీ సరయిన సమయంలో నీరు అందకపోవడం వలన దిగుబడి పడిపోయింది!"

"అయితే ఎకరానికి ఆ రెండుబస్తాల చొప్పున వచ్చిన నష్టం మొత్తం నీకివ్వవలసిన జీతంలో తగ్గించుకుంటున్నాను."

అవాక్కు అయిపోవడం భుజంగం వంతు అయింది.

మనసులో కుమిలిపోవడం తప్ప– 'ఇది అన్యాయం బాబయ్యా!' అనలేని నిస్సహాయతతో కుమిలిపోయేవాడు కాని, తన యజమాని కూలిపోవాలని ఎప్పుడూ అనుకోలేదు.

రుద్రమూర్తి చేసే ఆగడాలకు భరతవాక్యం పలకాలని బుద్ధుడు నడుం బిగించాడు. ప్రజల్ని మచ్చిక చేసుకొని పంచాయితీ ఎలక్షన్లలో ఎదురుతిరిగి అతని మీద తన తండ్రిని పోటీకి నిలబెట్టాలని యోచించాడు.

విషయం తెలుసుకున్న రుద్రమూర్తి– బుద్ధుణ్ని ఏవేవో కేసులలో ఇరికించి, గ్రామ నడిబొడ్డున ప్రజల సమక్షంలో చెట్టుకు కట్టి కొట్టించాడు. అవమాన భారం భరించలేని బుద్ధుడు– తల్లిదండ్రుల్ని, ఉన్న ఊరిని వదిలి ఎక్కడికో పారిపోయాడు.

తరువాత తెలిసింది– 'సిపాయి'గా మిలటరీలో చేరాడని! కన్నకొడుకులకు చదువుసంధ్యలు చెప్పించుకోలేని అసమర్ధత, కడుపు నిండా తిండి కూడా పెట్టలేని దుర్భర దారిద్ర్యాలతో భూస్వాముల ఉక్కుపాదాల క్రింద నలిగేకన్నా– ఎక్కడో ఒకచోట సుఖంగా ఉంటున్నాడనే సంతృప్తితో కాలం వెళ్లబుచ్చసాగారు... భుజంగం, జాలారి.

నెలనెలా కొడుకు పంపే ఐదువందల రూపాయల మనియార్డరు– అర్థాకలితో కాలం వెళ్లబుచ్చే భుజంగం కుటుంబం రెండుపూటలా ఎంగిలిపడే స్థాయి కెదిగింది. కొడుకు ప్రయోజకత్వం తండ్రిగా అతనికి తృప్తి నిచ్చినా– తన వెట్టిచాకిరి బ్రతుకు ఎంతగానో క్రుంగదీసేది.

విధి వక్రించింది..!

కలిసిరాని కాలం కాలసర్పమై మరోసారి భుజంగాన్ని కాటేసింది.

ప్రతినెలా క్రమం తప్పకుండా కొడుకు నుండి వస్తున్న మనియార్డర్లు ఒక్కసారి ఆగిపోయాయి. కొడుకు రాసే ఉత్తరాల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఆ ముసలిజంటకు కొన్ని నెలల తరువాత సమాచారం అందింది.

'బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు'లో చేరి విధులను సక్రమంగా నిర్వహిస్తున్న బుద్ధుడు– విధి విన్యాసాలకు తలొగ్గాడు. అక్రమంగా సరిహద్దులు దాటి దేశంలోనికి ప్రవేశిస్తున్న పరాయి మూకలను అడ్డుకోబోయాడు. దొంగచాటుగా వచ్చినవారి పన్నాగానికి గురై అసువులు బాసినాడు.

కుతంత్రాలు, అంతఃకలహాలు, టెర్రరిజాలలో బలహీనుణ్ణి బలాఢ్యుడు అణగద్రొక్కెయడం పరిపాటైన ఈ వ్యవస్థలో– 'స్వాతంత్ర్యం' అనేది కేవలం చెప్పుకోడానికే పరిమితమైపోతోంది.

కొడుకు మరణవార్త విని భుజంగం తల్లడిల్లిపోయాడు. జీవచ్ఛవంలా బ్రతుకుతున్న బానిస జీవితానికి ఏదో ఊరట కలిగిందనుకుంటే విషయం మళ్లీ మొదటికొచ్చింది.

ప్రభుత్వం తరపున ఏదో 'నామ్‌కే వాస్తే' ఎక్స్‌గ్రేషియా అందింది. అక్కడివారు ఏదో సానుభూతి తెలియజేశారే గాని, తరువాత విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

అగ్గిని గుండెల్లో భరించడం ఎంతో కష్టమైన విషయం. అగ్నికంటే తీవ్రంగా అణచివేత, ఆశ్రిత పక్షపాతం అనేవి మనిషిని దహించి వేస్తాయి. ఆ అంతర్జ్వాలల్లో కాలిపోవడం ఎంతోకాలం మనిషికి సాగని పని.

తన ఊరిలో అన్నకు ఎదురైన చేదుఅనుభవాలే సిద్ధయ్యకు కూడా ఎదురైనాయి. కుల వివక్షత, మనుషుల మధ్య విభేదాలు, చిన్నాపెద్దా, బీదాగొప్పా తారతమ్యాలు ప్రబలి– బ్రతుకు అర్థాన్ని కోల్పోవడంతో అతడు కూడా బుద్ధుడు బాటనే అనుసరించక తప్పలేదు.

"ఒరే అబ్బీ... వద్దురా! నువ్వు కూడా మమ్మల్ని విడిచి వెళితే భరించలేము. బుద్ధిగాడు చూడు- చెప్పాపెట్టకుండా వెళ్లి మిలటరీలో చేరి సిపాయిగా మారిపోయాడు. కనీసం చనిపోయిన తరువాత శవం కూడా చూడ్డానికి లేకుండా మా కళ్ళనుంచి దూరమైపోయాడు. ఈ ముసలి వయసులో మాకు ఇంతకుమించిన క్షోభ ఏముంటుంది చెప్పు? ఏదో అయ్యగారు ఉన్నాడు... అయన కాళ్ల దగ్గర మన బ్రతుకులు తెల్లారితే చాలు!" అంటూ అమ్మ జాలారి చెబుతుంటే మిన్నకుండిపోయాడు సిద్ధయ్య.

"ఒరేయ్ సిద్ధా! కలో, గంజో తాగుతూ అయ్యగారి పంచన ఇక్కడే పడుంటే ఈ కష్టాలు ఉండవు కదరా! కొట్టినా, తిట్టినా ఆయనే మనకు దేవుడు! నీవు కూడా మాకు దూరమైపోయి మమ్మల్ని ఏమీలేనివాళ్ళని చేస్తావా చెప్పు?"

"ఇప్పుడేమైందని చెప్పండి?! అయినా సంఘటిత శక్తి కరువై ఎల్లకాలం అనామకంగా బ్రతకడమేనా? మనకంటూ మనుగడ అక్కర్లేదా? ఏదో అవుతుందని నేను అనుకోవడంలేదు గాని, మీ బ్రతుకుల్ని చూస్తున్నాను కదా... మీరెంత సుఖంగా ఉన్నారో నాకు తెలియనిదా? ఎక్కడో ఒకచోట కనీసం నన్నైనా మనిషిగా బ్రతకనీయండి."

భుజంగానికి సిద్ధయ్య మాటల్లో కొంత నిజాయితీ కనిపించింది.

అన్న బాటనే ఎన్నుకున్న సిద్ధయ్యకు కాశ్మీరులో పోస్టింగ్ వచ్చింది.

నెలనెలా కొడుకు పంపే సొమ్ములతో వారు కొంతలో కొంత ఊరట చెందేవారు.

భారత రక్షణ దళాలకు, పాకిస్థానీయులకు కార్గిల్‌లో యుద్ధం ప్రారంభమైంది.

మహదేవ పట్నంలో భుజంగం మనసు ఎందుకో కీడు శంకించింది. ఇక జాలారి సంగతి సరేసరి! రోజూ ఆమె తన బిడ్డ క్షేమంగా ఉండాలని మ్రొక్కని దేవుడు లేడు.

ఉదయం, సాయంత్రం టీ.వీ.న్యూస్ కోసం ఆత్రుతగా ఎదురుచూసేవారు.

ఈసారి విధి భుజంగాన్ని మరింత విపరీతంగా, క్రూరంగా కాటేసింది.

కార్గిల్ యుద్ధంలో వైరివర్గానికి చెందిన సైన్యాలు భారత సైనిక స్థావరాలపై అమానుషంగా దాడి చేయడం మొదలుపెట్టాయి. యుద్ధవిమానాలు మనదేశంలోని కీలక ప్రాంతాలను, స్థావరాలను ధ్వంసం చేయడానికి సమాయత్తమయితే సరైన వ్యూహాన్ని పాటించక భారతసైన్యాలు చతికిల బడసాగాయి.

ఆ సమయంలో చెక్కుచెదరని ధైర్యసాహసాలతో శత్రువుల యుద్ధవిమానాన్ని నేలకూల్చాడు. లేకుంటే ఆ ప్రాంతం పూర్తిగా ధ్వంసమై భారత్‌కు తీవ్రనష్టం వాటిల్లేది.

గురితప్పని సిద్ధయ్య వ్యూహానికి ప్రతివ్యూహంగా శత్రుసైన్యాలు అతనిపై గురిపెట్టి దాడి చేయడంతో- 'అమర జీవి' అయిపోయాడు.

విషయం విన్న ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

వెంటనే మరణించిన సిద్ధయ్య వివరాలు, పుట్టిన గ్రామం, తల్లిదండ్రుల వివరాలు- టీ.వీ.లో ఫోటోతో సహా టెలికాస్ట్ చేయబడ్డాయి.

విషయం క్షణాల్లో అందరికీ తెలిసింది. మొత్తం సమాచారంతో, ఫోటోలతో విషయం పత్రికల్లో ప్రచురించబడింది.

ప్రజలు తండోపతండాలుగా వచ్చి భుజంగాన్ని, జాలారిని పరామర్శించి వెళుతున్నారు.

మృతదేహం కాశ్మీరు నుండి హైదరాబాద్‌కి, అక్కడినుండి మృతుని స్వగ్రామానికి తరలింప బడుతుందని సమాచారం అందింది. పూర్తిస్థాయి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది.

భుజంగానికి అంతా వింతగా అన్పిస్తోంది. ఊరంతా ఏదో తిరునాళ్ళు జరుగుతున్నట్లుగా ఉంది. బహుశా తన యజమాని తండ్రి పోయినప్పుడు కూడా ఇంతమంది జనం వచ్చివుండరు.

సిద్ధయ్య మృతదేహం పూలతో అలంకరింపబడిన వాహనంపై వుంచి ఊరేగింపుగా మహదేవ పట్నం తీసుకురాబడింది. వెంట ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులు వెంటరాగా... దారిపొడవునా ప్రతి ఊరిలోనూ ప్రజలు రోడ్ల కిరువైపులా నిలబడి దేశరక్షణ కొరకు పోరాడి వీరమరణం పొందిన సిద్ధయ్యకు కన్నీటివీడ్కోలు చెబుతున్నారు.

భుజంగం ఇంటిదగ్గర వుంచిన సిద్ధయ్య భౌతికకాయానికి ఒక్కొక్కరుగా వచ్చి పుష్పగుచ్ఛాలనుంచి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి పంపిన సంతాప సందేశాన్ని ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు హాజరయిన సీనియర్ మంత్రి చదివి వినిపించారు.

ఒకవైపు విషాదరాగం ఆలపిస్తుంటే- పోలీసు బృందం 'గార్డ్ ఆఫ్ హానర్' కవాతు చేసి, గాలిలోకి తుపాకుల్ని పేల్చి దివంగత సైనికునికి తమ గౌరవాన్ని తెలిపి శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రభుత్వ కార్యాలయాలపై రెపరెప లాడుతున్న జాతీయ జెండాలు అవనతం చేశారు.

చివరికి భుజంగం విషాద వదనంతో కొడుకు చితికి నిప్పంటించాడు.

కార్గిల్ పోరులో సిద్ధయ్యలా వీరమరణం పొందిన సైనికుల మృతదేహాలు ఇదివరకటిలా కాకుండా వారివారి ప్రాంతాలకు ఇప్పుడు తరలిస్తున్నారు. అవి మంచి సత్ఫలితాల నిస్తున్నాయి. ప్రభుత్వం పూర్తి అధికారలాంఛనాలతో అంత్యక్రియలు చేయడం వలన గ్రామప్రాంతాలలోని ప్రజల ఆలోచనగా ధోరణిలో మార్పు కనిపిస్తోంది.

ఆ విధంగా దేశభక్తి పెల్లుబికి ప్రజలు చైతన్యం పొందుతున్నారు.

పేపర్లో చదవడం, రేడియోలో వినడం. టీ.వీ.లో చూడడం తప్ప- ఇటువంటివి కళ్ళారా చూడనివారికి స్వాతంత్ర్యం విలువ తెలుస్తోంది. తమ ముందుతరాలు స్వాతంత్ర్య పోరాటాల్లో అసువులు బాసిన వారి దేశభక్తి గురించి చర్చించుకుంటున్నారు.

శత్రుదేశానికి, సైనికులకి మధ్య కాకుండా ఇప్పుడు అసలు సమస్య క్రిందిస్థాయి ప్రజల ముందుకొచ్చింది.

పాజిటివ్‌గా ఆలోచించడం వలన సామాన్య ప్రజలలో దేశభక్తి పెరిగి, దేశ పటిష్టతకు దోహద పడుతోంది. చైతన్యం పొందిన ప్రజలు కుల, వర్ణ వివక్షత, జాతుల మధ్య విభేదాల కతీతంగా వ్యవహరించి దేశసమైక్యతకు తోడ్పడుతున్నారు.

సిద్ధయ్య మరణం తరువాత వారు దేశం పట్ల సౌభ్రాతృత్వం, సార్వభౌమాధికారం, అల్లర్లు జరిగినప్పుడు శాంతిగా వుండి సంఘటిత శక్తిగా ఎదగడం, దేశంకోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడడం వంటివి అలవరచుకుంటున్నారు.

మొత్తానికి యుద్ధం రావడం అనివార్యం కానీ, అది రుద్రమూర్తి లాంటి ఎందరో నిరంకుశ పల్లెలలో దేశభక్తి కలుగజేయడం సమైక్యతకు, పటిష్టతకు కారణమైంది.

పోయిన సైనికులు ఎటూ తిరిగిరారు.

"ఎ బ్లెస్సింగ్ ఇన్ డిస్‌గ్యూస్!"

చెడు పరిణామాన్ని మంచిగా మరల్చుకొని ఊరట చెందటం దేశం గర్వించదగ్గ పరిణామం!

యుద్ధంలో చనిపోవడం వలన ఏర్పడ్డ 'వీరస్వర్గ నినాదం' పల్లెటూరు రాజకీయాల వేడిని చాలావరకు తగ్గించి అభివృద్ధి పథం వైపు దృష్టి సారిస్తోంది.

ప్రజల ఉద్దేశాలు, వారి భావాలు విన్న భుజంగం- వాటిని నెమరువేసుకుంటూ ఒక్కసారి ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చాడు.

ఎదురుగా... రుద్రమూర్తి!

"తమర్ని చూడలేదు అయ్యగారూ! ఇలా కూర్చోండి!" అంటూ నులకమంచం మీద పక్కను సరిచేశాడు.

"లేదురా! నీతో కొన్ని విషయాలు మాట్లాడాలని వచ్చాను. నీపట్ల, బుద్ధుడు పట్ల అప్పట్లో చాలా అమానుషంగా ప్రవర్తించాను. 'సాటి మనిషి' అనే గౌరవం కూడా లేకుండా పశువులా ప్రవర్తించిన నేను- సిద్ధయ్య మరణంతో తప్పు తెలుసుకున్నాను. స్వలాభం వదిలి ఆత్మార్పణ చేసినవాడు నా దృష్టిలో మహాత్ముడు. వాణ్ణి కన్న నీ జన్మ ధన్యమైంది.

నా హయాంలో మన గ్రామాభివృద్ధి చాలా కుంటుపడింది. అందుచేత నేను నా పదవికి రాజీనామా చేయదల్చుకున్నాను. నా స్థానంలో నిన్ను ఈ గ్రామసర్పంచ్‌గా ప్రపోజ్ చేయదల్చుకున్నాను. నీ హయాంలో మన గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందాలని నా ఆశ!" అంటూ ఆప్యాయంగా చేతులు పట్టుకున్నాడు.

'మంచి మార్పు' అనేది మనిషికి సమాజంలో సమున్నతమైన స్థాయిని కల్పిస్తుంటుంది. అది ఆలోచనా పరిధిని పెంచి, ఆత్మీయతానురాగాన్ని పెంపొందిస్తుంది.

మస్తిష్కంలో గుప్తపరచి, చలించని ధీశక్తితో మానసిక ఒత్తుడులకు అతీతుల్ని చేస్తుంటుంది.

పాజిటివ్‌నెస్‌గా రియాలిటీని చూడడం వలన మనిషిలో ఔన్నత్యం పెంపొందింపబడి ఉన్నతి వైపు నెట్టబడుతుంది.

సరిగ్గా రుద్రమూర్తిలో వచ్చిన మార్పు ఇదే!

"కొడుకు చచ్చి పుట్టెడు దుఃఖంలో వున్న నాకు- ఈ పదవులు ఎందుకు అయ్యా?! ఏదో మీ పంచన అలా కాలం గడుపుకుపోతే చాలు!"

"అదే నీ విశిష్ట వ్యక్తిత్వానికి చిహ్నం! కానీ, నా మాటను గౌరవిస్తావని ఆశిస్తున్నాను."

"అవన్నీ ఇప్పుడెందుకు అయ్యగారూ! మీరెప్పుడూ చల్లగా ఉండాలని నేను కోరుకుంటూ ఉంటాను."

రుద్రమూర్తిలో వచ్చిన ఈ మార్పుతో తమ గ్రామంలో వర్గవైషమ్యాలు, రాగద్వేషాలు, ఆశ్రిత పక్షపాతాలు, స్వార్థం-సంకుచితత్వాలు తగ్గుముఖం పట్టి సర్వతోముఖాభివృద్ధి వైపుకు గ్రామం పయనిస్తున్నట్లు భుజంగంలో అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతోంది.